సాక్షి నల్లగొండ

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



రుణాలు త్వరగా అందించాలి

రైతులందరికీ దీర్ఘకాలిక రుణాలను త్వరగా అందించాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 588.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 54,917 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 38,361 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,232 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,529 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: నిల్
ఏఎమ్మార్పీకి	: నిల్
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	641.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 5,680 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 2,445 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్













హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న ఎంజీయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజిమెంట్ ప్రొఫెసర్ మిర్యాల రమేష్, ఎన్జీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎం.అనిల్‌కుమార్, ఆర్.శ్రీధర్, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకుడు డాక్టర్ కృష్ణకౌండిన్య, చివ్వెంల మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ టీచర్ గిరిప్రసాద్, మిర్యాలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు(ఎస్ఏ) కృష్ణకాంత్‌నాయక్.

న్యూస్‌రీల్

'ఎన్జీ'లో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ లెక్చరర్లుగా పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు 6, హిందీ 1, ఉర్దూ 1, వాణిజ్య శాస్త్రం 1, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్ 2, బిజినెస్ అనాలటిక్స్ 1, అర్థశాస్త్రం 2, భౌతికశాస్త్రం 1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 1 పొలిటికల్ సైన్స్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పీజీలో 55 శాతం మార్కులు ఉన్నవారు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉంటే అర్హులని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో నెట్, సెట్, పీహెచ్‌డీతోపాటు బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడునని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను కళాశాల కార్యాలయంలో సెప్టెంబర్ 10వ తేదీ లోపు అందజేయాలని, 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



సబ్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే, డీఎస్పీ, ఆర్డీఓ తదితరులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా గురువారం అమిత్‌నారాయణ్ బాధ్యతలు స్వీకరించారు. 2022 ఏఐఎస్ బ్యాచ్‌కు చెందిన అమిత్ రెండేళ్లపాటు వికారాబాద్‌లో ప్రొబేషనరీ పీరియడ్ పూర్తి చేసుకుని మొదటి పోస్టింగ్‌గా మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆర్డీఓకుగా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్‌రావు రిలీవ్ అయి మంచిర్యాలకు బదిలీపై వెళ్లారు. సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రాజశేఖర్ రాజు, తహసీల్దార్ హరిబాబు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ మాట్లాడుతూ సమర్థవంతమైన పాలనే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తన పరిధిలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను పక్కాగా చేపట్టాలి



వట్టిమర్తిలో పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

చిట్యాల: ప్రభుత్వ కార్యక్రమాలను పక్కాగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన చిట్యాల పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులతో సమావేశమై మాట్లాడారు. అనంతరం వట్టిమర్తి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామంలోని పారిశుద్ధ్య పనులు, స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో నాటిన మొక్కల వివరాలు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌పీ.జయలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ శ్రీలత, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న నాగిళ్ల మురళి

నల్లగొండ టౌన్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అన్నారు. గురువారం నల్లగొండలోని టీఎన్‌జీఓ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద బాధితులను ఆదుకోవడానికి సీఎం సహాయ నిధికి ఉద్యోగులు ఒక రోజు మూలవేతనం ఇచ్చేందుకు ఉద్యోగ జేఏసీ తీసుకున్న నిర్ణయానికి జిల్లా ఉద్యోగులు మద్దతు ఇస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులమంతా ఒక రోజు వేతనం అందిస్తామన్నారు. టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి జే.శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినా ప్రజలకు సహాయం చేయడంలో ఉద్యోగులు ముందుంటారన్నారు.

కేజీబీవీ, మోడల్ పాఠశాలల టెండర్లలో

గోల్‌మాల్!

'హాకా' పేరుతో విద్యార్థుల భోజన కాంట్రాక్టు దక్కించుకున్న దళారులు



కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు(కేజీబీవీ), మోడల్ స్కూళ్లలో కిరాణా సామాను, కూరగాయలు, చికెన్, కోడిగుడ్లు, మటన్, పండ్లు, తదితర నిత్యావసరాల సరఫరాకు కాంట్రాక్టును ప్రభుత్వ ఏజెన్సీ పేరుతో దళారులు దక్కించుకున్నట్లు తెలిసింది. హాకా (హైదరాబాద్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ అసోసియేషన్) పేరుతో దళారుల దందా కొనసాగించారు. వారు చెప్పే రేట్లకు కొనుగోళ్ల కమిటీ ఆమోద ముద్ర వేసి దళారులకు దోచిపెడుతోంది. హోల్‌సేల్ మార్కెట్ రేట్లను పరిగణనలోకి తీసుకోకుండా అధిక ధరలను ఖరారు చేసి ప్రభుత్వానికి నష్టం చేకూర్చుతోంది. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో అడ్డగోలుగా కట్టబెట్టిన అధికారులు
- పప్పులు, కూరగాయల ధరల నిర్ణయంలో కమిటీ ఇష్టారాజ్యం
- నిత్యావసరాల అధిక ధరలతో ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో నిత్యావసరాల సరఫరా కోసం గత నెలలో పాఠశాల విద్యా శాఖ టెండర్లను ఆహ్వానించింది. వాటికి సంబంధించిన నెగోషియేషన్ చేయాల్సిన కొనుగోళ్ల కమిటీ పెద్దగా ఆ ప్రక్రియపై దృష్టి పెట్టకుండానే, కనీసం హోల్‌సేల్ మార్కెట్ రేట్లను పరిగణనలోకి తీసుకోకుండా హాకా పేరుతో దళారులకు కాంట్రాక్టును కట్టబెట్టింది. హాకా ప్రభుత్వ ఏజెన్సీ అయినందున ఆ పేరుతో పనులను దక్కించుకుంటే సమస్యలు రావన్న ఉద్దేశంతో దళారులు ఈ దందాకు దిగినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. అధికారులను ప్రలోభపెట్టి, ఒత్తిడి తెచ్చి పప్పులు తదితర కిరాణా సామాను సరఫరాకు ఇష్టారాజ్య రేట్లను ఖరారు చేయించుకున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మొదట బెదిరింపులు, ఆ తరువాత రింగ్..

కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు కిరాణం, ఇతర సరుకుల సరఫరాకు చేసేందుకు టెండర్లు 17 మంది కాంట్రాక్టర్లు టెండర్ దరఖాస్తులు కొనుగోలు చేయగా, వారంతా టెండర్‌లో పాల్గొనకుండానే చేసేలా బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది. దీనిపై కాంట్రాక్టర్ల మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. చివరకు రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు ముడుపులు చెల్లించి వారంతా టెండర్లలో పాల్గొనకుండా చేసినట్లు తెలిసింది. ముగ్గురు నలుగురు కాంట్రాక్టర్లు ఒక్కటై ఈ తతంగం పూర్తి చేసి, హాకా పేరుతో వారే ఈ టెండర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది.

అధిక ధరలతో ప్రభుత్వానికి తీవ్ర నష్టం

హోల్ సేల్ మార్కెట్‌లో ఉన్న ధర కంటే అధికంగా కోట్ చేసి ప్రభుత్వ ఖజానా నుంచి రూ.కోట్లు కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. దానికి అధికారులు ఆమోద ముద్ర వేసి ప్రభుత్వానికి పెద్ద ఎత్తున నష్టం జరిగేలా చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కంది పప్పు హోల్‌సేల్ మార్కెట్ ధరను ఒక్కసారి పరిశీలించినా.. వారేం చేశారన్నది అర్థమవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. హోల్ సేల్ మార్కెట్‌లో 50 కిలోల కందిపప్పు బస్తా కొంటే కిలోకు రూ.150 మాత్రమే పడుతుండగా, అదనపు కలెక్టర్ నేతృత్వంలోని కొనుగోళ్ల కమిటీ కిలోకు రూ.171 ఖరారు చేయడం ఏంటన్నది అంతుపట్టడం లేదు. ఇదొక్కటే కాదు మరో 20 రకాల వస్తువులు పెసర పప్పు, మినప పప్పు, వేరుశనగ నూనె, సన్‌ఫ్లవర్ ఆయిల్, చక్కెర, ఇడ్లీ రవ్వ, ఉప్మ రవ్వ, అటుకులు, ఆవాలు, శనిగలు, గ్రీన్‌పీస్, పెసర్లు, ఉలవలు, బెల్లం, మీల్‌మేకర్, నువ్వులు, మురమరాలు, గరం మసాల, చికెన్, మటన్ మసాలాలో ఒక్కో కిలోకు రూ.10 నుంచి రూ.50 వరకు లాభం చేకూర్చేలా అధిక ధరలను ఖరారు చేసి రూ.కోట్లలో ప్రభుత్వానికి నష్టం జరిగేలా, కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చేలా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కూరగాయల ధరలను అడ్డగోలుగా నిర్ణయించి విద్యార్థులకు పౌష్టికాహారం అందకుండా చేశారన్న విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వానికి ఆదాచేసే విధానమేదీ?

కిరాణం, ఇతర వస్తువుల సరఫరాలో కాంట్రాక్టర్లు.. ఉన్న ధరల కంటే అధిక ధరలకు కోట్ చేస్తే కొనుగోళ్ల కమిటీ వాటిని పరిశీలించి ప్రభుత్వానికి నష్టం జరగకుండా చూడాలి. కానీ దళారుల ముడుపులు బాగోతంలో బలహీనపడిన అధికారులు కొందరు ప్రభుత్వానికి భారీ ఎత్తున నష్టం జరిగేలా అధిక ధరలను నిర్ణయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

చిట్యాలలో హెలికాప్టర్ ల్యాండింగ్



ఆగిన హెలికాప్టర్‌ను రిపేర్ చేసేందుకుగాను టెక్నీషియన్‌లతో వచ్చిన మరో హెలికాప్టర్

- సాంకేతిక లోపంతో పంటచేల మధ్య ఆపిన పైలెట్
- తప్పిన పెను ప్రమాదం

చిట్యాల: చిట్యాల పట్టణ శివారులోని వ్యవసాయ పొలాల్లో గురువారం ఐఏఎఫ్(ఇండియన్ ఎయిర్ ఫోర్స్)కు చెందిన హెలికాప్టర్ సాంకేతిక లోపంతో ఆగిపోయింది. విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లిన రెండు హెలికాప్టర్‌లు అనంతరం హకీంపేటకు వెళ్లేందుకు గురువారం ఉదయం బయలు దేరాయి. 11:30 గంటల సమయంలో చిట్యాల పట్టణ శివారులోకి రాగానే వాటిలో ఒక హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని గుర్తించిన పైలెట్ చాకచక్యంగా వ్యవసాయ పొలాల్లో నెమ్మదిగా ల్యాండ్ చేశాడు. అనంతరం ఈ హెలికాప్టర్‌తో వచ్చిన మరో హెలికాప్టర్ సైతం మొదటగా కిందికి దిగింది. సాంకేతిక లోపంతో నిలిచిపోయిన హెలికాప్టర్‌ను పరిశీలించిన పైలెట్స్ మరమ్మతులకు అవసరమైన టెక్నీషియన్‌ను తీసుకువచ్చేందుకు హకీంపేటకు ఆ రెండో హెలికాప్టర్ బయలుదేరింది. అనంతరం మధ్యాహ్న సమయంలో హకీంపేట నుంచి వచ్చిన టెక్నీషియన్స్ సాంకేతిక సమస్యలకు గురైన హెలికాప్టర్‌లో మరమ్మతులు చేపట్టగా తిరిగి హకీంపేటకు మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో తిరిగివెళ్లిపోయింది. కాగా హెలికాప్టర్ పైలెట్ చాకచక్యంగా సాంకేతిక సమస్యను గుర్తించటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ హెలికాప్టర్‌లో పైలెట్‌తో పాటు మరో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. హెలికాప్టర్ ఆగిన విషయం తెలుసుకున్న చిట్యాల ఏఎస్ఐ జాన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మరమ్మతులకు గురైన హెలికాప్టర్‌కు టెక్నీషియన్స్‌తో రిపేర్ చేయించేంత వరకు ఏఎస్ఐ బందోబస్తుగా ఉన్నారు.

వ్యవసాయ కూలీల సందండి

చిట్యాల పట్టణ శివారులోని పొలాల్లో అకస్మాత్తుగా హెలికాప్టర్ కిందికి దిగడంతో ఆ ప్రాంతమంతా వ్యవసాయ కూలీలతో సందడి నెలకొంది. పొలం పనుల్లో నిమగ్నమైన వారంతా ఒక్కసారిగా ఆగిన హెలికాప్టర్ వద్దకు చేరుకుని సెల్‌ఫోన్‌లతో ఫొటోలు దిగారు. హెలికాప్టర్ ఆగిన విషయం తెలుసుకున్న చిట్యాలతో పాటు వనిపాకల గ్రామస్తులు చేరుకుని సెల్ఫీలు దిగారు.



హెలికాప్టర్ వద్ద ఫొటో దిగుతూ సంతోషం వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కూలీలు

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

మర్రిగూడ: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మర్రిగూడ మండలం సరంపేట గ్రామంలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లో మురుగు నీటి నిల్వ ఉండకుండా మట్టిని పోయించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జి.చిన మునయ్య, ఎంపీఓ రవికుమార్, అసిస్టెంట్ ఏపీఓ వివేక్, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

బడి, గుడి.. రెండూ సమానమే..




చర్లపల్లి జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయురాలు కె.అరుంధతికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందించి సన్మానిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

- దేవుడిచ్చిన వరం ఉపాధ్యాయులు
- పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి
- ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఉత్తమ గురువులకు సన్మానం

నల్లగొండ: గుడి, బడి రెండూ సమానమేనని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యా శాఖ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండలోని జీఎంఆర్ పంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో కలిసి మంత్రి కోమటిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు, జ్ఞాపికలు అందజేసి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మనకు దేవుడిచ్చిన వరం ఉపాధ్యాయులని అభివర్ణించారు. ఉపాధ్యాయులంతా అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది ప్రస్తుత సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. టీచర్లు ప్రభుత్వ స్కూళ్లలోని విద్యార్థులను తమ సొంత పిల్లలను మాదిరిగా చదివించాలని కోరారు. ఈసారి పది ఫలితాల్లో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల అభివృద్ధికి కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ చేయూతనిస్తుందన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు కోడూరి విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పట్ల ఉపాధ్యాయులు నమ్మకాన్ని కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకడం లేదని అన్ని ప్రాంతాల్లో ఆ విధమైన పరిస్థితి రావాలన్నారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దాలన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు మూత పడకుండా చూడాలన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు తగట్టుగా బోధనా పద్ధతి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి మంత్రి పూలమాల వేసి నివాళుర్పించారు. డీఈఓ భిక్షపతి స్వాగతోపన్యాసం చేయగా ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్‌లు పూర్ణచంద్ర, శ్రీనివాస్, ఆర్డీఓ రవి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ పాల్గొన్నారు.





ఉపాధ్యాయ దినోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్

'ఓరుగంటి' ఉద్యమ స్ఫూర్తి మరువలేనిది

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

నల్లగొండ టూటౌన్: ఎన్ని అడ్డంకులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి బీజేపీ బలోపేతానికి ఉద్యమ స్ఫూర్తితో పనిచేసిన వ్యక్తి ఓరుగంటి రాములు అని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో నిర్వహించిన దివంగత బీజేపీ నేత ఓరుగంటి రాములు ప్రథమ వర్ధంతి సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పాత, కొత్త అనే తేడా లేకుండా ప్రజా సమస్యలపై ఓరుగంటి రాములు ఢిల్లీలో కూడా ఆందోళన చేసిన వ్యక్తి అని కొనియాడారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసినప్పుడు తన గెలుపు కోసం రాములు ఎంతగానో కృషి చేశారన్నారు. రాములు సంఘ్ కార్యకర్త నుంచి బీజేపీలో సీనియర్ లీడర్‌గా ఎదిగారని, ఎంపీగా, ఎమ్మెల్యేగా పోటీ చేసి సఫలీకృతం కాకున్నా పార్టీని గ్రామగ్రామానికి తీసుకెళ్లాడన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ఓరుగంటి రాములు పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు ప్రజలు, ధర్మం, హిందూ సమాజ రక్షణ కోసం పాటుపడ్డారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా నిలిచి జిల్లాలో పార్టీని బలోపేతం చేసిన వ్యక్తి ప్రమాదంలో చనిపోవడం బీజేపీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి రాములు సతీమణి ధనలక్ష్మి, ఆయన కుమారులు ఓరుగంటి వంశీ, ఓరుగంటి శ్రీనివాస్, ఓరుగంటి మాధవప్రసాద్, బీజేపీ నాయకులు నూకల నర్సింహారెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, కల్లెం బాల్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, చింతా ముత్యాల్‌రావు, పోతెపాక సాంబయ్య, పెరిక మునికుమార్, వివిధ పార్టీల నాయకులు చకిలం అనిల్‌కుమార్, యామ దయాకర్ పాల్గొన్నారు.



రాములు విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పిస్తున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

ఓటర్ల జాబితా రీషెడ్యూల్ విడుదల

నల్లగొండ: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వార్డులు, డివిజన్ల వారీగా తయారు చేసిన ఓటర్ల జాబితా శుక్రవారం ప్రచురించాల్సి ఉంది. కానీ, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అధికారులంతా బిజీ కావడంతో ఎన్నికల సంఘం గురువారం రీషెడ్యూల్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం ఈనెల 13న పంచాయతీల్లోని వార్డు డివిజన్లు, మండల పరిషత్ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను నోటీసు బోర్డుపై ఉంచుతారు. 18న రాజకీయపార్టీల నాయకులతో ఎన్నికల అధికారులు సమావేశం. 19న ఎంపీడీఓలతో సమావేశం, 14 నుంచి 21వ తేదీ వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి 26 తేదీ నాటికి వాటిని పరిష్కరించాలి. 28న తుది ఓటర్ల జాబితాను ప్రకటించాలని రీషెడ్యూల్‌లో పేర్కొంది.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మిర్యాలగూడ అర్బన్: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం మిర్యాలగూడలో గంజాయి సేవించి పట్టుబడిన 130 మంది యువకులు, వారి తల్లిదండ్రులకు నిర్వహించిన కౌన్సిలింగ్‌లో మాట్లాడారు. గంజాయి సేవించి పట్టుబడిన వారికి ముందుగా కౌన్సిలింగ్ ఇస్తామని తిరిగి పట్టుబడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలను అమ్మినా, సేవించినా డయల్ 100 గాని సెల్: 8712670266 గాని సమాచారం అందించాలన్నారు. అనంతరం సైక్రియాటిస్టు డాక్టర్ విజయ్‌కుమార్ మాదక ద్రవ్యాలు తీసుకుంటే జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీ రాజశేఖర రాజు, సీఐలు కరుణాకర్, వీరబాబు, జనార్దన్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మర్రిగూడ: బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం మర్రిగూడ మండలంలో చోటుచేసుకుంది. వట్టిపల్లి గ్రామ పరిధిలోని బట్టపల్లి గ్రామానికి చెందిన దుబ్బ ప్రభాకర్ హైదరాబాద్ నుంచి బైక్‌పై వస్తున్నాడు. తిరగండ్లపల్లి గ్రామ సమీపంలోకి రాగానే గేదె అడ్డురావడంతో బైక్ అదుపుతప్పింది. దీంతో ప్రభాకర్‌తోపాటు బైక్‌పై ఉన్న అతడి స్నేహితుడికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గొర్రెల మంద పైనుంచి దూసుకెళ్లిన బొలేరో

- 15 గొర్రెలు మృతి


గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

పెద్దవూర: గొర్రెల మందపై నుంచి బొలేరో వాహనం దూసుకెళ్లడంతో 15 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన పెద్దవూర మండల పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఇమాంపేటకు చెందిన నగిరే గంగరాజు, మరికొంత మంది రైతులు కలిసి గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గొర్రెల మందలు మేపుకుంటూ కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై వెళ్లే క్రమంలో సంగారం స్టేజీ దాటాక మల్లేపల్లి వైపు నుంచి అతివేగంగా వచ్చిన బొలేరో వాహనం నేరుగా గొర్రెల మందపై నుంచి దూసుకెళ్లింది. దీంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, పదకొండు పైగా గొర్రెలు పైగా గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వీరబాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన బొలేరో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

యాదాద్రిలో ఎమ్మెల్సీ కోదండరాం పూజలు


స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కోదండరాం దంపతులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని ఎమ్మెల్సీ కోదండరాం దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం బ్రేక్ దర్శనం సమయంలో ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు, అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకున్న ఎమ్మెల్సీ కోదండరాం దంపతులు, ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత ప్రత్యేక అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఉత్తమ గురువులకు అవార్డు


అవార్డు అందుకుంటున్న సైదానాయక్, జెడ్పీహెచ్‌ఎస్, దిలావర్‌పూర్

ఎ. శ్రీనివాసగౌడ్, జెడ్పీహెచ్‌ఎస్–మర్రిగూడ
కె. శ్రీనివాస్, జెడ్పీహెచ్‌ఎస్ తిరుమలగిరి(సాగర్)
జె. కృష్ణయ్య, జెడ్పీహెచ్‌ఎస్– మాండ్ర
సీహెచ్. వెంకటరాంరెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్–కనగల్
ఎన్. యాదగిరి, జెడ్పీహెచ్‌ఎస్–కొప్పోలు
పి. సైదానాయక్, జెడ్పీహెచ్‌ఎస్–చిన్నకాపర్తి
ఎం. సుశీల, జెడ్పీహెచ్‌ఎస్–రాజుపేట
ఇ. దేవపాల, జెడ్పీహెచ్‌ఎస్, తొండ్లవాయి
జి. శైలజ, జెడ్పీహెచ్‌ఎస్, అప్పాజిపేట
ఎ. వేమారెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్–చింతగూడెం
ఎం. మోహన్‌రావు, జెడ్పీహెచ్‌ఎస్, దోరేపల్లి
కె. బద్రినారాయణ, జెడ్పీహెచ్‌ఎస్, అయిటిపాముల
బి. రమేష్, జెడ్పీహెచ్‌ఎస్–వేములపల్లి
జి. రజని, టీజీఎంఎస్, వల్లాల
హైమావతి, కేజీబీవీ, అనుముల
ఎం. వసంత, కేజీబీవీ, కేతేపల్లి
గుగులోతు పార్వతి, కేజీబీవి, మిర్యాలగూడ
ఎం. సునీత, ఎంపీపీఎస్, హాలియా
ఎ. శ్రీనివాస చక్రవర్తి, జెడ్పీహెచ్‌ఎస్, మారేపల్లి
ఆర్. లక్ష్మీనారాయణ, జెడ్పీహెచ్‌ఎస్, పుల్లెంల
ఎస్. విజిత, జెడ్పీహెచ్‌ఎస్, కురంపల్లి
సి. గోపాల్, జెడ్పీహెచ్‌ఎస్ వెంకటేశ్వరనగర్
కైసర్ సబిహ, జెడ్పీహెచ్‌ఎస్, ఏపూర్
జి. బాలయ్య, జెడ్పీహెచ్‌ఎస్, చిన్నకాపర్తి
సీహెచ్. వెంకట నర్సింహాచారి, జెడ్పీహెచ్‌ఎస్, వెలికట్టె
పి. వెంకట్‌రావు, జెడ్పీహెచ్‌ఎస్, గుండ్రాంపల్లి
పి. రాధిక, జెడ్పీహెచ్‌ఎస్, దామరచర్ల
అనీస్ ఖాతున్, జెడ్పీహెచ్‌ఎస్, కొండ్రపోల్
సేనావత్ రంగనాయక్, జెడ్పీహెచ్‌ఎస్, ముదిగొండ
బి. మల్లయ్య, జెడ్పీహెచ్‌ఎస్, వెల్మకన్నె
ఎం. జయమ్మ, జెడ్పీహెచ్‌ఎస్, కందుకూర్
పి. శ్రీనివాసరెడ్డి, ఎంపీపీఎస్, తేనేపల్లి
వై. మర్రెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్, నడికుడ
వి. అనురాధ, జెడ్పీహెచ్‌ఎస్, తేనేపల్లి
ఎండీ. నజీరుద్దీన్, జెడ్పీహెచ్‌ఎస్, పరడ
బి. కోటిలింగయ్య, జెడ్పీహెచ్‌ఎస్, చెర్వుఅన్నారం
పి. రాంమోహన్‌రెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్, చెర్వుఅన్నారం
సిరందాసు భాగ్యలక్ష్మి, జెడ్పీహెచ్‌ఎస్, కేతేపల్లి
బూర్గు జగదీశ్వర్, జెడ్పీహెచ్‌ఎస్, కేశంపల్లి
ఎం. కార్లో, జెడ్పీహెచ్‌ఎస్, కస్నెకల్
వి. వెంకటేశ్వర్లు, జెడ్పీహెచ్‌ఎస్, పాములపాడ్
కె. నిర్మలదేవి, ఎంపీపీఎస్, మర్రిగూడ
ఆర్. విఠల్, ఎంపీపీఎస్, తిరుగండ్లపల్లి
టి. రేణుక, జెడ్పీహెచ్‌ఎస్, మర్రిగూడ
ఆర్. లక్ష్మీనర్సింహమూర్తి, జెడ్పీహెచ్‌ఎస్, ఎరగండ్లపల్లి
పి. అనురాధ, జెడ్పీహెచ్‌ఎస్, శివన్నగూడ
బి. సాగరయ్య, ఎంపీయూపీఎస్, వీటీపాలెం
బి. వెంకటరత్నం, జెడ్పీహెచ్‌ఎస్, యద్గార్‌పల్లి
బి. శోభారాణి, జెడ్పీహెచ్‌ఎస్, ఆలగడప
బి. అంజయ్య, జెడ్పీహెచ్‌ఎస్, మునుగోడు
పి. నాగరాజు, జెడ్పీహెచ్‌ఎస్, ఊకొండి
ఎన్.రజిత, జెడ్పీహెచ్‌ఎస్, ఓగోడు
ఎం. రాములు, జెడ్పీహెచ్‌ఎస్, తాటికల్
షేక్ సలీం, జిహెచ్‌ఎస్, బొట్టుగూడ
వీర్లపాటి పద్మజ, జెడ్పీహెచ్‌ఎస్, ముశంపల్లి
ఎ. గోపాల్‌రెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్, నర్సింగ్‌బట్ల
జి. మరియమ్మ, జిహెచ్‌ఎస్, పద్మానగర్
సీతా వెంకటయ్య, జెడ్పీహెచ్‌ఎస్, నాంపల్లి
ఎస్‌కే. రంజాన్, జెడ్పీహెచ్‌ఎస్, పసునూర్
కె. వినోద, జెడ్పీహెచ్‌ఎస్, ఏపీలింగోటం
వి. అంజయ్య, జీఎంహెచ్‌ఎస్, సాగర్
పి. శోభారాణి, జెడ్పీహెచ్‌ఎస్, చలకుర్తి
కె. క్రిష్ణయ్య, జెడ్పీహెచ్‌ఎస్, పెద్దవూర
సి. హిమవంతరెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్, వెలమగూడెం
పి. ప్రభాకర్, ఎంపీపీఎస్, ఊట్కూర్
నయిమున్నీసా, జెడ్పీహెచ్‌ఎస్, అడ్లూరు
బి. అంజయ్య, జెడ్పీహెచ్‌ఎస్, వల్లాల
జి.రాములు, జెడ్పీహెచ్‌ఎస్, పెద్దదేవులపల్లి
భాస్కర్‌రెడ్డి, ఎంపీయూపీఎస్, రంగుండ్లతండా
పి. వినయ్‌కుమార్, జెడ్పీహెచ్‌ఎస్, తిరుమలగిరి
ఎం. కృష్ణయ్య, జెడ్పీహెచ్‌ఎస్, రావులపెంట
జి. యతీష్‌కుమార్, టీజీఎంఎస్, చింతపల్లి
ఆర్. కరుణాకర్, టీజీఎంఎస్, గుండ్లపల్లి
ఇ. స్వరూప్‌రెడ్డి, ఎస్‌పీఎం మోడల్ స్కూల్
జి. శ్రీను, టీజీఎంఎస్, కొర్లపాడ్
డి. బాగ్యలక్ష్మి, టీజీఎంఎస్, తుంగపాడ్
షేక్ బీబీజాన్, టీజీఎంఎస్, నేరుడుగొమ్ము
బి. పుష్ప, టీజీఎంఎస్, త్రిపురారం
డి. సత్యవతి, ఎంపీపీఎస్ చింతగూడెం
ఎన్. గిరిబాబు, ఎంపీపీఎస్, బండకిందతండా
ఆర్. పాపయ్య, ఎంపీయూపీఎస్, కంబాలపల్లి
ఎ. భిక్షమయ్య, ఎంపీపీఎస్, అంగడిపేట
ఆర్. రమాదేవి, ఎంపీపీఎస్, బంగారిగడ్డ
బి. సుధీర్‌రాజు, ఎంపీపీఎస్, ఉమ్మాపురం
బి. జయశ్రీ, ఎంపీయూపీఎస్, హోమనాథపల్లి
కె. చిన వెంకటేశ్వర్లు, ఎంపీపీఎస్, కుర్మేడు
కె. రాంరెడ్డి, ఎంపీపీఎస్, బండవత్‌తండా
పి. రవీందర్‌రెడ్డి, ఎంపీపీఎస్, బెట్టెతండా
క్రాంతి శ్రీనివాసులు, ఎంపీపీఎస్, దేవరకొండ
మస్న కవిత, ఎంపీపీఎస్, తూర్పుపల్లి
శ్రీరంగం రవి, జెడ్పీహెచ్‌ఎస్, దేవరకొండ
సీహెచ్. శిరీష, ఎంపీపీఎస్, కాశవారిగూడెం
సీహెచ్. పుష్పలత, ఎంపీపీఎస్, మోతికానిగూడెం
టి. సోమయ్య, ఎంపీపీఎస్, జంగమాయిగూడెం
కె. పుష్పలత, ఎంపీపీఎస్, కురంపల్లి
టి. పద్మ, ఎంపీపీఎస్, రేగట్టె
డి.అశోక్, ఎంపీపీఎస్, తూర్పువారిగూడెం
కె. మధు, ఎంపీపీఎస్, మనిబాయిగూడెం
కె. నాగలక్ష్మి, ఎంపీపీఎస్, అక్కలాయిగూడెం

దీర్ఘకాలిక రుణాలు త్వరగా అందించాలి

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


ఏటీఎంను ప్రారంభిస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాలను త్వరితగతిన అందించాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నల్లగొండలోని డీసీసీబీలో ఆధునీకరించిన ఏటీఎంను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడారు. బ్యాంకు నిర్దేశించిన రుణాలను అందించడంలో మేనేజర్‌లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రూ.100 కోట్ల గృహనిర్మాణ రుణాల లక్ష్యాలను వేగంగా పూర్తిచేయాలన్నారు. డీసీసీబీ పరిధిలో ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ నిధులు రూ.279 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. బంగారు ఆభరణాలపై రూ.450 కోట్ల రుణాలు అందించినందుకు బ్యాంకు మేనేజర్లను అభినందించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు పాలకవర్గం సిద్ధంగా ఉందని తెలిపారు. సమావేశంలో సీఈఓ శంకర్‌రావు, బ్యాంకు డైరెక్టర్లు గుడిపాటి సైదులు, పాశం సంపత్‌రెడ్డి, అందెల లింగంయాదవ్, నాబార్డు, డీసీసీబీ అధికారులు, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

చిన్న సినిమాలకు చేయూత అందిస్తాం

- సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి: చిన్న బడ్జెట్ సినిమాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున చేయూత అందిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తన స్వీయ దర్శకత్వంలో రేగట్టె లింగారెడ్డి నిర్మిస్తున్న 'మీకు ఇష్టమైతే రేపే మీ పెళ్లి' సినిమాకు సంబంధించిన పోస్టర్, ఆడియోను గురువారం నార్కట్‌పల్లి పరిధిలోని వివేరా హోటల్‌లో గురువారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అంశాలపై సినిమాలు తీయాలని అన్నారు. ఈ సినిమాకు బందారు దాయనయ్య కథా రచయితగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పున్నపురాజు యాదగిరి, కల్లూరి శ్రీను, నేతగాని కృష్ణ, వరల రమేష్, రేగట్టె నర్సిరెడ్డి, నవీన్‌రెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


సినిమా పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- నేడు ఫైనల్స్


సెమీఫైనల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న మోనెక్స్ సన్‌రైజ్ తెలంగాణ స్టేట్ 3వ మినీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. గురువారం సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో సెమీఫైనల్స్ మ్యాచ్‌లు జరిగాయి. బాలుర సింగిల్స్‌లో కామారెడ్డికి చెందిన రుద్రీశ్వర్‌రావు, వరంగల్‌కు చెందిన మీర్ ఉజైర్ హుస్సేన్ విజయం సాధించి ఫైనల్‌కు అర్హత సాధించారు. బాలుర డబుల్స్ విభాగంలో నల్లగొండకు చెందిన కృష్ణారెడ్డి, బాలగంగాధర్‌రెడ్డి విజయం సాధించారు. బాలికల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన అయిరా, సూర్యాపేటకు చెందిన అన్విత‌రెడ్డి విజయం సాధించి ఫైనల్‌లో అడుగుపెట్టారు. విజేతలుగా నిలిచిన వారు శుక్రవారం జరిగే ఫైనల్స్‌లో తలపడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళ అదృశ్యం


అరుణ

తిప్పర్తి: తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశరాజుపల్లిలో నివాసముంటున్న మహిళ అదృశ్యమైనట్లు ఏఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు. చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన రూపాని అరుణ తన భర్తతో గొడవల కారణంగా ఐదు నెలల నుంచి కేశరాజుపల్లిలో రూం అద్దెకు తీసుకుని ఉంటుంది. ఆగస్టు 29న ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. అరుణ ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి ఓర్సు వెంకటయ్య చిట్యాల మండలం పేరేపల్లికి చెందిన రూపాని అనిల్‌పై అనుమానం ఉన్నట్లు గురువారం తిప్పర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.